

పాలకొల్లు మున్సిపల్ కమిషనర్‌గా విజయసారధి




ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ కమిషనర్‌గా విజయసారధి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చీరాల మున్సిపాలిటీ నుంచి బదిలీపై పాలకొల్లు విచ్చేశారు. కమీషనర్‌కు మున్సిపల్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఎఇలు సాంబశివుడు, సతీష్, మున్సిపల్ ఆర్ఐ ఎ.శ్రీనివాస్‌రాజు, టిపిఒ బ్రహ్మం, త్రినాథరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమార్ రాజా, శ్రీనివాస్‌రాజు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న శేషాద్రి రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

ప్రజల కోసం అడుగులు..

అర్థం చేసుకోండి





టిక్కెట్లు దక్కనివారికి న్యాయం చేస్తాం

విధ్వంసకర పాలనను అడ్డుకుందాం

తాడేపల్లిగూడెం 'జెండా' సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

పెద్దసంఖ్యలో తరలొచ్చిన జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, తాడేపల్లిగూడెం, తణుకు రూరల్

'పొత్తులో భాగంగా కోరుకున్న వారికి టిక్కెట్లు ఇవ్వలేకపోవచ్చు.. పని చేసిన ప్రతి కార్యకర్తా, నాయకుడికి న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటాం' అని టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఇటీవల పొత్తు నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారు ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభ 'జెండా' బుధవారం తాడేపల్లిగూడెం బైపాస్‌లో జరిగింది. సభకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, జనం తరలివచ్చారు. సభకు దాదాపు లక్ష మంది వరకు వచ్చారని అంచనా. స్టేజీపై దాదాపు 500 మంది అతిథులు కూర్చునేలా ఏర్పాటు చేయడంతో పాటు జనం కోసం పెద్దఎత్తున గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు సభ ప్రారంభం కానుందని ఆరు గంటల వరకు కొనసాగుతుందని ముందుగా ప్రకటించారు. అయితే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకునేసరికి 5.45 గంటలైంది. దీంతో సభ 8 గంటల వరకు కొనసాగింది. సభ ప్రారంభం ఆలస్యం కావడంతో జనం తిరుగుముఖం పట్టిన పరిస్థితి కన్పించింది. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్టేజీపైకి వచ్చి ఇద్దరు చేతులెత్తి అభివాదం చేస్తూ పవన్‌కళ్యాణ్ టిడిపి జెండా, చంద్రబాబు జనసేన జెండా ఊపుతూ ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ టిక్కెట్లు రాని నేతలు ఎవరూ హెచ్చుకు పోవొద్దని, ఎవరూ ఎక్కువ కాదు.. తక్కువ కాదని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం తాను, పవన్ శ్రీకారం చుట్టామన్నారు. టిడిపి, జనసేన దెబ్బకు వైసిపి ముక్కలవ్వాలన్నారు. అంతా కలిసి కష్టపడి పనిచేసి నష్టం జరగకుండా చూడాలన్నారు. టిడిపి, జనసేన విన్నింగ్ టీమ్ అని, వైసిపి చీటింగ్ టీమ్ అని అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని, హత్యకు గురైన ప్రజాస్వామ్యాన్ని బతికించడానికి కలిశామన్నారు. ఎపిలో అన్ని వనరులూ ఉన్నప్పటికీ జగన్ సర్వనాశనం చేశాడన్నారు. రాష్ట్రంలో సైకో పాలన అంతం చేయాలన్నారు.



పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ టిడిపి, జనసేన అభివృద్ధికి, విజయానికి స్ఫూర్తి అన్నారు. బూత్‌లో వైసిపి వాళ్ల తేడా చేస్తే జెండాతో బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో యువతను, రైతులను, మహిళలను, అంగన్‌వాడీలను సైతం జగన్ మోసం చేశాడన్నారు. ఎపి రోడ్లపై పాలు పోస్తే చక్కగా ఎత్తుకోవచ్చంటూ ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల్లో జగన్ వస్తే స్కాం ఆంధ్రాగా మారుతుందని ప్రధాని మోడీ అన్నారన్నారు. 2019 నుంచి రాష్ట్రం దోపిడీకి గురైందన్నారు. జనసేనకు ఆర్థిక వనరులుగాని, క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి కార్యకర్తలు రాష్ట్రమంతలా లేరని, ఇటుక ఇటుక పేర్చి ఇల్లు కడుతున్నామన్నారు. జగన్ తప్పు చేసినా వాళ్ల మద్దతుదారులు వెనుకేస్తున్నారని, నా సమూహం మాత్రం నన్ను ప్రశ్నిస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మాతో కలిసి నడవాలని, రాష్ట్ర భవిష్యత్తును మార్చాలని కోరారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, సినీ నటుడు బాలకృష్ణ, కొత్తపల్లి సుబ్బారాయుడు, కొణతాల రామకృష్ణ తదితరులు మాట్లాడారు. పెద్దఎత్తున యువత తోసుకుంటూ బారికేడ్లు పడగొట్టి అంతా స్టేజీ ముందుకు రావడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. సభా కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న టిడిపి నాయకుడు పాలి ప్రసాద్ కాలుజారి పడిపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాలు విరిగినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు తెలిసింది. పెద్దఎత్తున జనం రావడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

నరసాపురం నుంచి నేనే పోటీ చేస్తా : ఎంపీ రఘురామకృష్ణంరాజు

ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు టిడిపి, జనసేన ఉమ్మడి సభకు విచ్చేశారు. రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ నరసాపురం నుంచి మళ్లీ నేనే పోటీ చేస్తానని తెలిపారు. నాకు టిక్కెట్ రాదని కొన్ని పత్రికలు రాస్తున్నాయని, అయితే నేనే కూటమి నుంచి పోటీ చేస్తానని చెప్పారు. త్వరలోనే మీ దగ్గరకొచ్చేస్తానంటూ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.



హెలీప్యాడ్ వద్ద జగన్‌కు స్వాగతం పలికిన నేతలు, అధికారులు

నాగబాబు కుమారుని వివాహానికి సిఎం

వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన జగన్

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్, కాళ్ల

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం భీమవరంలో పర్యటించారు. వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ముఖ్యనేత గుణ్ణం నరసింహ నాగేంద్రరావు (నాగబాబు), రాజరాజేశ్వరి దంపతుల కుమారుడు సుభాష్, భీమవరానికి చెందిన ఇర్రింకి గోపాలకృష్ణ, రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె విజయ దీప్తి వివాహానికి జగన్ హాజరయ్యారు. వధూవరులు సుభాష్, విజయదీప్తిలను ముఖ్యమంత్రి జగన్ ఆశీర్వదించి పుష్పగుచ్ఛం అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి హెలికాప్టర్లో భీమవరం బయలుదేరిన ముఖ్యమంత్రి జగన్ కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు 3.42 గంటలకు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి జగన్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, ఏలూరు రేంజ్ డిఐజి జివివి.అశోక్‌కుమార్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన రాధాకృష్ణ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన వివాహ కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపాక ఇరువురి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం 4.12 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి పెదఅమిరంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని 4.30 గంటలకు హెలీకాప్టర్లో వెనుదిరిగారు. సిఎం జగన్ భీమవరం పర్యటన కేవలం 48 నిమిషాల్లో ముగిసింది. కార్యక్రమంలో ఎంఎల్ఎలు పుప్పాల శ్రీనివాసరావు, తలారి వెంకట్రావు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, నరసాపురం ఎంపీ అభ్యర్థి గుడాల ఉమాబాల, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎస్‌సి కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, అటవీ శాఖ డైరెక్టర్ మంతెన యోగేంద్రబాబు, అల్లూరి సేవాసమితి ప్రెసిడెంట్ గాదిరాజు సుబ్బరాజు, మాజీ ఎంఎల్ఎ అల్లు వెంకట సత్యనారాయణ, ఆకివీడు జెడ్‌పిటిసి వేగేశ్న వెంకటరాజు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రఘురాం, గూడూరి శ్రీనివాస్, చీర్ల రాధాకృష్ణయ్య, యడ్ల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - ఆచంట

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ డిమాండ్ చేశారు. బుధవారం వల్లూరు రైతుభరోసా కేంద్రం వద్ద ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను వల్ల పంటనష్టం సంభవించి మూడు నెలలు దాటుతున్నా రైతులకు పరిహారం చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సొమ్ము రూ.16 కోట్లకు పైగా రావాల్సి ఉండగా ఇప్పటికీ ఖాతాల్లో జమ చేయకపోవడం దారుణమని విమర్శించారు. రైతుభరోసా కేంద్రాలు పెట్టామని చెప్పడం తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వరి, కొబ్బరి, ఆక్వా పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం వల్ల రైతులు చాలా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు బోళ్ల సుబ్బారావు, కేతా రంగారావు, మారిమిల్లి సీతారాం, తంగెళ్ల నారాయణరావు, గుడాల సత్యనారాయణ, గుబ్బల వెంకటేశ్వరరావు, బోడ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




వల్లూరులో రైతు భరోసా కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

పిఠాపురం వైపు పవన్ చూపు..!

భీమవరం జనసేన అభ్యర్థిగా అంజిబాబు ఖరారు?

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ పోటీ చేసే అసెంబ్లీ స్థానంపై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారనే ప్రచారానికి తెరపడింది. భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు మార్గం సుగమమైంది. పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేస్తారని ఆది నుంచి ప్రచారం సాగింది. దీనిలో భాగంగానే పవన్ ఇటీవల భీమవరంలో పర్యటించి టిడిపి ముఖ్య నేతలు, పట్టణ ప్రముఖులను కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో పవన్ మళ్లీ భీమవరం నుంచి పోటీ చేస్తారని అంతా భావించారు. అయితే ఇటీవల టిడిపి, జనసేన అధినేతలు అభ్యర్థుల జాబితా వెల్లడించే సమయంలో జనసేన నుంచి ఐదుగురు అభ్యర్థుల పేర్లనే ప్రకటించారు. అందులో పవన్ పేరు ఎక్కడా రాలేదు. దీంతో పలు సందేహాలు నెలకొన్నాయి. విస్తృత కసరత్తు తర్వాత ఎట్టకేలకు పిఠాపురం నుంచే పవన్ చూపుతున్నట్లు తెలిసింది. పిఠాపురం నియోజకవర్గంలో కాపు సామాజిక తరగతుల ఓట్లు దాదాపు 91 వేలు ఉండటంతో ఇక్కడి నుంచి పోటీ చేస్తే పవన్ భారీ విజయానికి ఢోకా ఉండదని జనసేన శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే పిఠాపురం నుంచి పోటీకి పవన్ మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. దీంతో భీమవరం నుంచి జనసేన తరపున అంజిబాబు పోటీ చేసేందుకు ఏర్పాట్లు సాగుతున్నట్లు తెలిసింది. దీనిపై మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.




పవన్ కళ్యాణ్ తో మాట్లాడుతున్న అంజిబాబు (ఫైల్‌ఫోటో)

రైతులకు వెన్నుదన్నుగా రైతుభరోసా

కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

కౌలు, సన్న, చిన్నకారు రైతులకు వెన్నుదన్నుగా వైఎస్ఆర్ రైతుభరోసా నిలుస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సున్నా వడ్డీ రాయితీ, రైతుభరోసా సొమ్ము అందించే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రైతుభరోసా-పిఎం కిసాన్ 1,27,114 మంది రైతులకు రూ.25.42 కోట్లు, సున్నా వడ్డీ రాయితీ 39,270 మంది రైతులకు రూ.5.53 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. కౌలురైతులు పెట్టుబడి సాయం వినియోగించుకుని ఆర్థిక లబ్ధి పొందాలన్నారు. అనంతరం సున్నావడ్డీ రాయితీకి సంబంధించిన నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సలహా మండలి సభ్యులు కొట్టి కుటుంబరావు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, ప్రజాప్రతినిధులు

ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్టు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం తీరప్రాంతంలో మత్స్య ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఫిషింగ్ హార్బర్, కార్గోపోర్టు నిర్మాణం దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. చినమైనవానిలంకలో రూ.430 కోట్లతో నిర్మించే ఫిషింగ్ హార్బర్ కార్గో పోర్టు నిర్మాణం పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో ఎనిమిది ఫిషింగ్ హార్బర్ కార్గో పోర్టు నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. జిల్లాలో మత్స్యకారుల చిరకాల కల కోరిక నెరవేరుతుందన్నారు. జిల్లాలో 19 కిలోమీటర్లు మేర సముద్ర తీర ప్రాంతం ఉందన్నారు. చినమైనవానిలంకలో 120 ఎకరాల్లో నిర్మించే ఈ కార్గో పోర్టు నిర్మాణం పనులకు కేంద్ర ప్రభుత్వం నుండి పర్యావరణం, సాంకేతిక అనుమతులు లభించాయన్నారు. శిథిలమైన నల్లి క్రీక్ వంతెన నిర్మాణ పనులు రూ1.50 కోట్లతో వేగవంతంగా చేపడుతున్నామన్నారు. బియ్యపుతిప్పలో రూ.10 కోట్లతో ఫిషింగ్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు ఆండ్రాజు చల్లారావు, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, నేతలు దొంగ మురళీకృష్ణ, సంగాని మోహనరావు, మైలా వీర్రాజు, తహశీల్దార్ ఎన్ఎస్ఎస్.ప్రసాద్, పోర్టు డిఇ ఎస్.ప్రకాశరావు, ఎఇ సిహెచ్.తమ్మారావు, పిఎంసి.భాస్కరరావు, మెర్లిన్ పాల్గొన్నారు.



హార్బర్ పనులకు భూమి పూజ చేస్తున్న ప్రసాదరాజు

మూఢనమ్మకాల వ్యతిరేక చట్టం తీసుకురావాలి

జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు - భీమవరంలో ఘనంగా జెవివి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఒక ప్రత్యేక చట్టం తీసుకురావాలని జనవిజ్ఞాన వేదిక (జెవివి) జిల్లా అధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద జెవివి ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. జెవివి సీనియర్ నాయకులు పి.సీతారామరాజు జెవివి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడారు. 1988లో ఇదే రోజున ఆవిర్భవించిన జనవిజ్ఞాన వేదిక 36 ఏళ్లుగా సైన్స్ ప్రచారం చేస్తుందన్నారు. ప్రస్తుత కాలంలో మూఢనమ్మకాలు మరింత పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాలంటే మూఢనమ్మకాల వ్యతిరేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ పదార్థ పరిణామాన్ని తెలియజేసే పిరియాడికల్ టేబుల్‌ను, మానవ పరిణామాన్ని తెలియజేసే జీవ పరిణామ సిద్ధాంతాన్ని కొత్త పుస్తకాల సిలబస్‌లో తిరిగి పొందుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ పి.ఫణిరాజేష్, పి.సీతారామరాజు, థామస్, సత్యప్రియ పాల్గొన్నారు.

పాలకొల్లు :జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాలకొల్లు వీవర్స్ కాలనీలోని సమతా మహిళా విజ్ఞాన భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పతాకాన్ని జిల్లా గౌరవాధ్యక్షులు కెఎస్‌పిఎన్.వర్మ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ మానవ మనుగడకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఆనాటి మానవుడు కనిపెట్టిన నిప్పు నుండి నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్ వరకూ అన్నీ సైన్స్ వల్ల అభివృద్ధి చెందినవే అన్నారు. మానవుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే బాధ్యతను జన విజ్ఞాన వేదిక సక్రమంగా నిర్వహిస్తోందన్నారు. జాతాలు, మ్యాజిక్ షోలు, చెకుముకి సైన్సు సంబరాల ద్వారా విద్యార్థుల్లో, యువకుల్లో మారుమూల ప్రాంతాల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు 36 సంవత్సరాలుగా కృషి చేస్తోందని చెప్పారు. జిల్లా కార్యదర్శి వై.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సైన్స్ ప్రమోట్ చేయడంలో జన విజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణ రావు, ఆర్.సత్యనారాయణ, జె.జయదుర్గారావు, గంధం కుమారస్వామి రాజా, ఎం.జయబాబు, మానేం ధన గణేష్, జె.దినేష్ పాల్గొన్నారు.



భీమవరంలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి నేతలు



పాలకొల్లు : పతాకాన్ని ఆవిష్కరించిన జెవివి నేతలు

ప్రహరీ కూలి చిన్నారి దుర్మరణం

రోడ్డుపై నడిచి వెళ్తుండగా ఘోరం

ప్రజాశక్తి - తణుకు

రోడ్డుపై నడిచి వెళుతుండగా అకస్మాత్తుగా గోడ కూలిన ఘటనలో ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన చిక్కాల విజయలక్ష్మి(5) తల్లి వేణితోపాటు తణుకులో బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు పట్టణంలోని 19వ వార్డులో రూట్స్ స్కూల్ ప్రాంతంలో సత్తిరాజు వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా పాతదైన ప్రహరీ గోడ కూలి పక్కగా నడిచివెళ్తున్న విజయలక్ష్మి, వేణిలపై పడింది. తీవ్ర గాయాల పాలైన చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యర్థుల ఖర్చులు నివేదిక పకడ్బందీగా ఉండాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

రానున్న పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నివేదికలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల వ్యయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ మాట్లాడుతూ ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షల వరకు, శాసనసభ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థికి రూ.40 లక్షల వరకు ఖర్చుకు అనుమతి ఉందన్నారు. అంతకుమించి ఖర్చు చేస్తే ఆయా అభ్యర్థులు అర్హత కోల్పోతారన్నారు. అన్ని బృందాలు వారికి అప్పగించిన విధంగా అభ్యర్థుల ఖర్చుల వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు వారి ఖర్చుల నివేదికలను మూడుసార్లు వ్యయ పరిశీలకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. రూ.10 లక్షలకు మించి ఎక్కడైనా నగదు పట్టుకున్న పక్షంలో ఆదాయపు పన్ను అధికారికి తెలియజేసి సీజ్ చేయించాలన్నారు. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి నగదు తీసుకెళుతుంటే పట్టుకోవాలని, రూ.10 వేలు విలువ చేసే బహుమతులు, వివిధ రకాల వస్తువులుగానీ ఉంటే సీజ్ చేయాలని అన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, అచ్యుత్ ఆనంద్, చెన్నయ్య, ఎన్నికల విభాగం కలెక్టరేట్ పర్యవేక్షకులు దుర్గాప్రసాద్, మీడియా నోడల్ అధికారి టి.నాగేశ్వరరావు, ఎలక్షన్ డిటి ఎం.సన్యాసిరావు, సహాయ వ్యయ పరిశీలకులు, ఎన్నికల నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో చెత్త వేయొద్దు : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

డ్రెయినేజీలో చెత్తా చెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలకు ఉందని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ పలు వార్డుల్లో డ్రెయినేజీలను పరిశీలించి మాట్లాడారు. మురుగు సమస్య లేకుండా ప్రతి రోజూ డ్రెయినేజీ శుభ్రం చేసే పనులు చేపట్టామన్నారు. మురుగునీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, ప్రజలు అంటురోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. మున్సిపల్, సచివాల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యుత్ కష్టాలకు చెక్ : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

నూతనంగా నిర్మించిన సబ్ స్టేషన్ వల్ల మండలంలో విద్యుత్ కష్టాలకు చెక్ పెట్టినట్లేనని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. బుధవారం యండగండిలో రూ.5.2 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను పివిఎల్ నరసింహరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే యండగండిలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో మండలంలోని యండగండి, ఉనుదుర్రు, పాందువ్వ, ఆరేడు, కలిగొట్ల, మైపా తదితర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయొచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, వైస్ ఎంపిపి దత్తాల సుజాత రాణి, నాయకులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై రామరాజు ఆగ్రహం

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఉండడంతో పంచాయతీ సిబ్బంది ఉండి ఎంఎల్ఎ రామరాజు ఫ్లెక్సీలు తొలగించి, వైసిపి బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీనిపై ఎంఎల్ఎ రామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హెలీపాడ్ ప్రాంతం నుంచి రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎంఎల్ఎ ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో టిడిపి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

రామకృష్ణంరాజు ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

డివైఎఫ్ఐ మాజీ ఉపాధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు ఆశయ సాధన కోసం నేటి యువతీ యువకులు కృషి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం వల్లూరు శాఖా కార్యదర్శి బొర్రా ధర్మారావు అన్నారు. వల్లూరు సెంటర్లో ఇందుకూరి రామకృష్ణంరాజు స్థూపం వద్ద 41వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరి సూర్యనారాయణ రాజు, సుబ్బారావు, సత్యనారాయణ, హరేరామ్ పాల్గొన్నారు.

టిడిపి, జనసేన సభకు తరలిన నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

తాడేపల్లిగూడెం నియోజకవర్గం పత్తిపాడులో బుధవారం జరుగుతున్న టిడిపి, జనసేన ఉమ్మడి బహిరంగ సభకు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు (రామరాజు) నాయకత్వంలో టిడిపి, జనసేన నేతలు తరలివెళ్లారు. కార్లపై పెద్ద సంఖ్యలో ర్యాలీగా వెళ్లిన టిడిపి, జనశ్రేణులకు నర్సాపురం, రుస్తుంబాద నుంచి మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్, జనసేన పార్టీ కార్యాలయం నుంచి చినమిల్లి సత్యనారాయణరావు, టిడిపి కార్యాలయం నుంచి పొత్తూరి రామరాజులు జెండాలు ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, వర్ధనపు ప్రసాద్, కొత్తపల్లి నాని, జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, వన్నెంరెడ్డి శ్రీనివాస్, గుగ్గిలపు మురళీ పాల్గొన్నారు.

తణుకు : తాడేపల్లిగూడెంలో జరిగే టిడిపి జనసేన ఉమ్మడి భారీ సభకు తణుకు నుంచి మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు తరలివెళ్లారు. రాధాకృష్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

మొగల్తూరు : టిడిపి, జనసేన సంయుక్తంగా తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

1న భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

ఆచంట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు కట్టుబడిన పార్టీలకే రానున్న ఎన్నికల్లో ఓట్లు వేస్తామని భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పూసల ఏడుకొండలు, కేతా నాగ ఆంజనేయులు అన్నారు. బుధవారం శ్రీకనకదుర్గ తాపీమేస్త్రీ భవనంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆచంటలో కార్మిక సంఘం కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ఎత్తున కార్మికులను సమీకరించి ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. 1214 మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేసామని, ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చిన ఈ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, నేతలు బొంతు శ్రీను, వద్దిపర్తి అంజిబాబు, బొలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పాలకొల్లులో జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గ జనసేన కార్యాలయాన్ని లాకుల వద్ద ప్రముఖ సినీ నిర్మాత బన్నీవాసు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. పవన్ కళ్యాణ్ సారథ్యంలో జనసేన, టిడిపిలు అధికారం చేజిక్కించుకోనున్నాయన్నారు. ఈ 45 రోజులూ జనసేన కార్యకర్తలు, నాయకులు పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. పాలకొల్లులో జనసేన పోటీలో లేకపోయినా టిడిపి అభ్యర్థి నిమ్మల రామానాయుడు పూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శిరగం సురేంద్ర, బోనం చినబాబు, అల్లు రాధాకృష్ణ, శిద్ధిరెడ్డి అప్పారావు, తులా రామలింగేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.

జగన్‌ను ఆకర్షించిన వాసర్ల ఫ్లెక్సీలు

ప్రజాశక్తి - భీమవరం


జగన్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

నరసాపురం ఎంపీ స్థానాన్ని ఆశిస్తున్న వైసిపి బిసి ముఖ్య నేత వాసర్ల ముత్యాలరావు జగన్ పర్యటన నేపథ్యంలో భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. పాలకొల్లు నియోజకవర్గ వైసిపి నేత గుణ్ణం నాగబాబు కుమారుడు వివాహానికి పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు దారి పొడుగునా బ్యానర్లు కట్టి ముఖ్యమంత్రిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. హెలిప్యాడ్ ప్రాంతం నుంచి వివాహ కన్వెన్షన్ వరకు రహదారి ఇరువైపులా రోడ్డు పొడవునా ముఖ్యమంత్రి జగన్ వాసర్ల ముత్యాలరావు భారీ చిత్రపటాలతో ఏర్పాటు చేసి అందర్నీ ఆకర్షించారు. రాజకీయ నాయకులు, ప్రముఖులు ఈ ఫ్లెక్సీ బ్యానర్లు చూసి ముత్యాలరావు నరసాపురం పార్లమెంట్ సీటు దక్కించుకునేందుకు, జగన్మోహన్ రెడ్డిని ఆకర్షించేందుకు చేసిన ప్రయత్నంగా రాజకీయంలో చర్చ సాగుతోంది. ఇప్పటికే బిసి సామాజిక వర్గానికి చెందిన గూడూరి ఉమా బాలను నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ బాధ్యతను అధిష్టానం అప్పగించడం జరిగింది.

పాలకోడేరులో లారీ బీభత్సం

వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో బుధవారం రాత్రి ఓ లారీ బీభత్సం సృష్టించింది. మోగల్లు వైపు నుంచి పాలకోడేరు వస్తున్న లారీ పాలకోడేరు సమీపంలో కొత్తపేట వద్ద రహదారి పక్కనున్న కొబ్బరి చెట్టును ఢీకొట్టింది. స్థానికంగా గూడు పక్కనే కూర్చున్న చెందిన తోట వెంకటేశ్వరరావు (44)పై కొబ్బరి చెట్టు పడడంతో పాటు లారీ దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో తోట వెంకటేశ్వరరావు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. సంఘటన స్థలాన్ని పాలకోడేరు పోలీసులు పరిశీలించారు. ఈ ప్రమాద సమయంలో లారీ అక్కడే వదిలి లారీ డ్రైవర్ పరారయ్యారు. మితిమీరిన వేగంతో లారీ నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

మెట్టు దిగని విడివాడ..!

తాడేపల్లిగూడెం సభకు వెళ్లని వైనం
సభ తర్వాత తదుపరి కార్యాచరణ

ప్రజాశక్తి - తణుకు



టిడిపి - జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితాలో జనసేన తణుకు నియోజవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావుకు సీటు రాకపోవడంతో ఆయన తీవ్ర నిరాశతో ఉన్నారు. బుధవారం తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో జరుగుతున్న ఉమ్మడి బహిరంగ సభకు కూడా ఆయన వెళ్లలేదు. జిల్లాలో జనసేన పెద్దలతో పలుసార్లు కలిసి మాట్లాడినా ప్రయోజనం లేకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సభలో స్పష్టమైన హామీ రాకపోతే కార్యకర్తలతో చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. జనసేన నాయకత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆయన ఒక్క మెట్టు కూడా దిగి రాలేదు. తణుకు ఎంఎల్ఎ సీటు కేటాయించాలని పట్టుబట్టి ఉన్నారు. నియోజవర్గంలో విడివాడకు మంచి పట్టు ఉంది. జనంలోకి జనసేన కార్యక్రమాలతో ఇటు గ్రామాల్లోనూ పట్టణంలోనూ ఇంటింటికీ వెళ్లి జనసేన ఆశయాలు సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉన్నా ఎన్నికలు వచ్చేసరికి ఎంఎల్ఎ దక్కకపోవడంతో ఆయన నిరాశకు గురయ్యారు. 2019 జరిగిన ఎన్నికల్లో తణుకు నియోజవర్గం నుంచి జనసేన ఒంటరిగా పోటీ చేసింది. ఆ సమయంలో విడివాడకు టిక్కెట్ వస్తుందని ఆశించారు గానీ చివరకు పసుపులేటి వెంకట రామారావుకు పవన్ కళ్యాణ్ సీటు ఇవ్వడంతో నిరాశ చెందారు. అయినప్పటికీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు ఆదేశాల మేరకు నియోజవర్గంలో జనసేన పార్టీకి ఒక గుర్తింపు తీసుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, ఎంపిటిసి స్థానాల్లో జనసేన పలు స్థానాల్లో గెలిచింది. తణుకులో పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర సందర్భంగా వచ్చే ఎన్నికల్లో జనసేన నుంచి విడివాడ పోటీ చేస్తారని ప్రకటించారు. ఈ ప్రకటనతో ఆయన ఆశలు రేకెత్తించాయి. ఈ ఎన్నికల్లోనైనా టిక్కెట్ వస్తుందని ఆశించిన విడివాడకు నిరాశే మిగిలింది. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి రాధాకృష్ణకు మద్దతు ఇస్తారో లేదో మరికొన్ని రోజుల్లో తేలనుంది.

మహాశివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి


ప్రజాశక్తి - ఆచంట


మాట్లాడుతున్న డిప్యూటీ తహశీల్దార్ సుగుణ సంధ్య

ఆచంట రామేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ తహశీల్దార్ డి.సుగుణ సంధ్య అన్నారు. స్థానిక రామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డిటి మాట్లాడుతూ మార్చి ఆరు నుంచి పదో తేదీ వరకూ జరిగే ఉత్సవాల నిర్వహణకు దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు ప్రతిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పన, తదితర అంశాలపై చర్చించారు. వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలతో పాటు జనరేటర్ సౌకర్యం కల్పించాలన్నారు. వశిష్ట గోదావరి కోడేరు వద్ద యాత్రికులు శివరాత్రి రోజు స్నానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బుద్ధిరాజు విద్యాసాగర్, వైద్యాధికారి డి.సత్యవతి, ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


తాడేపల్లిగూడెం : సివి రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యాజమాన్యం

దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంజినీరింగ్, సాంకేతికత, పరిశోధనలు, సైన్స్, మూలస్తంభాలుగా నిలుస్తున్నాయని, విద్యార్థులు సైన్సు ఆధారిత ఆవిష్కరణలపై దృష్టిసారించాలని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి తెలిపారు. ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారత ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత సివి.రామన్‌కే దక్కుతుందని చెప్పారు. దేశ ప్రతిష్టాత్మక పురస్కారం భారత రత్నతోపాటు భౌతిక శాస్త్రంలో ఎన్నో అపార సేవలందించిన మహోన్నత వ్యక్తి సివి.రామన్ అని ప్రశంసించారు. దేశం తరపున మొట్టమొదటి నోబెల్ బహుమతిని అందుకుని భారత్ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనుడు సివి.రామన్ అని, ఆయనను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని నవ చైతన్యానికి నాంది పలకాలని వివరించారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలతోపాటు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత యువతరానిదేనని తెలిపారు. సృజనాత్మక ఆలోచనలకు ఆధునిక సాంకేతికతను జోడించి నూతన ఆవిష్కరణలను చేపట్టాలని వివరించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ జిబి.వీరేష్ కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ రాముడు, డాక్టర్ తపస్, డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నరసాపురం: యుకె వనితా క్లబ్ ఆధ్వర్యంలో వశిష్టా స్కూల్లో నేషనల్ సైన్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, వనితా క్లబ్ రీజనల్ ఛైర్ పర్సన్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడారు. భారత వైజ్ఞానిక రంగంలో మొట్ట మొదటి నోబెల్ బహుమతి గ్రహీత సివి.రామన్ 'రామన్ ఎఫెక్ట్'ని కనుగొన్న రోజును నేషనల్ సైన్స్ డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు సివి.రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధ్యక్షురాలు పి.ఉమామహేశ్వరి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి కేంద్రీకరిస్తే అద్భుతాలు సష్టించ వచ్చన్నారు. ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషాకమల, సన్మాన గ్రహీతలు పొన్నాడ సుబ్రహ్మణ్యం పొన్నాడ పద్మావతి, రంగినీడి సుబ్బారావు, రంగినీడి భరణి గురించి సభకు పరిచయం చేశారు. సన్మానం అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి బండి స్వర్ణలత, సహాయ కార్యదర్శి తోట భారతి, తోట అరుణ, వశిష్టా స్కూల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : చిన్నారులకు బాల్య నుంచే సైన్స్‌పై అవగాహన కల్పించాలని శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు, పాందువ్వ మండల పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పిఎస్ఎన్.రాజు అన్నారు. గురువారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఉద్దేశించి వారు మాట్లాడారు. అనంతరం విద్యార్థులచే వివిధ ప్రాజెక్టులను తయారు చేయించి నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచంట : సముద్రపు నీరు నీలం రంగులో ఎందుకు ఉంటుందో అధ్యయనం చేసి కనిపెట్టిన మహనీయులు సివి.రామన్ అని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ కొనియాడారు. కొడమంచిలి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డేను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు మెమెంటో, సెర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యల్లమెల్లి బేబీ రాజేష్, స్కూల్ ఛైర్మన్ బొరుసు రాంబాబు పాల్గొన్నారు.

గణపవరం: విద్యార్థులు శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం కాలేజీలో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నాడీ వ్యవస్థ, రుగ్మతలకు ఉపయోగపడే ఔషధ మొక్కల పాత్రను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపల్ వై.మదురాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, వి.సందీప్, లెక్చరర్లు షేక్.అన్సారీ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఉపకరణాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవిశంకర్ సర్కార్, వై.బ్రహ్మయ్య పాఠశాల సిబ్బంది ఉన్నారు. కాళీపట్టణంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యార్థులు రూపొందించిన సైన్స్ ఉపకరణాలను ప్రదర్శించారు.

పాలకొల్లు : డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా సైన్స్ దినోత్సవం నిర్వహించారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం మార్టేరు, వ్యవసాయ శాస్త్రవేత్త పి.వెంకట రమణారావు అతిథిగా పాల్గొన్నారు. ప్రతి రంగంలోనూ వెలువడుతున్న నూతన ఆవిష్కరణలు మానవాళికి ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, రమణ, మణిమాల, రూప్‌సింగ్, విజయలక్ష్మి, మమత పాల్గొన్నారు.

భీమవరం : ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎఆర్‌కెఆర్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆప్ కాస్ట్ జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీనివాస్ విచ్చేసి మాట్లాడారు. నిత్య జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలను సైన్స్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి.సాయిప్రసాద్ మాట్లాడుతూ సివి.రామన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తత్వం, క్విజ్ పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించిన విజేతలకు జన విజ్ఞాన వేదిక ప్రచురించిన సైన్స్ పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం


మొగల్తూరులో టైలర్ల ప్రదర్శన

ప్రపంచ టైలర్స్‌డే వేడుకలను బుధవారం టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రుస్తుంబాద జగన్నాథస్వామి గుడి రోడ్డులో కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్ వొవే చిత్రపటానికి పులపర్తి సుబ్రమణ్యం పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టైలర్స్ సంక్షేమ సంఘం జిల్లా మాజీ నేత బళ్ల భవానీప్రసాద్, బుడిగ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ కార్యదర్శి కె.వాసు, గొర్రెల ఆనంద్‌కుమార్, కొబోజి ప్రసాద్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సమాజంలో మానవుని హుందా తనానికి తగ్గట్టుగా బట్టలు కుట్టే నాగరికత నేర్పినవారు టైలర్స్ అని వేల్పూరు గ్రామ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి కొనియాడారు. టైలర్స్ డే సందర్భంగా వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సాలిపేటలో కుట్టు మిషను రూపకర్త ఇలియాస్ వొవే జయంతి సందర్భంగా సంఘ పతాకాన్ని సంఘం అధ్యక్షులు మల్లేశ్వరపు నాగరాజు ఎగరవేశారు. అనంతరం సర్పంచి వోవే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ టైలర్స్ నందం శ్రీరాములును సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, కె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజలకు అనుగుణంగా దుస్తులు కుట్టి ఇవ్వడం దర్జీల ప్రత్యేకత అని టైలర్స్ అన్నారు. మొగల్తూరులోని బాపూజీ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టు మిషన్ సష్టికర్త ఇలియాస్ వొవే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ఉండి

కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ డి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా బి.ముకుందరావు పాల్గొని మాట్లాడుతూ డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, వెదజల్లే వరి సాగు విస్తరణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు గత సంవత్సరం శాస్త్రవేత్తల పనితీరును వచ్చే సంవత్సరం కార్యాచరణ నివేదికను సమావేశంలో తెలిపారు. అవార్డు గ్రహీత రైతులు నెక్కంటి సుబ్బారావు, చందు, జి.వెంకటరత్నంను సత్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.దక్షిణామూర్తి, వరప్రసాద్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, ఎన్.డెబోరా మెస్సియానా పాల్గొన్నారు.

ఛాంబర్స్‌లో నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో రూ.2 కోట్ల ఖర్చుతో నిర్మించిన నూతన స్వర్ణోత్సవ భవనాలను ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నర్సింహారావు ప్రారంభించారు. పలువురు దాతల సహకారంతో భారీ బిల్డింగులు నిర్మించారు. సెక్రటరీ కలిదిండి రామరాజు బిల్డింగ్ నిర్మాణానికి తీవ్ర కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో విద్య ఉండటానికి ఛాంబర్ 50 సంవత్సరాల నుండి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఛాంబర్ జనరల్ సెక్రటరీ దేవరపల్లి లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎన్‌వి.సత్యనారాయణమూర్తి, అడిషనల్ ఛైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి, కోశాధికారి జల్లూరి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కౌన్సిల్ హాల్ వద్ద ఛైర్మన్ బర్రె వెంకట రమణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. టిడిపి కౌన్సిల్ సభ్యుడు పాలూరు బాబ్జి, జనసేన సభ్యులు భరత్ సురేష్, సూర్యకుమారి, అరుణ వైసిపి కౌన్సిల్ సభ్యులు వన్నెంరెడ్డి శ్రీను, కేసరి గంగరాజు, సఖినేటిపల్లి సురేష్, శ్రీకాంత్ పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై మాట్లాడారు. ఏ వార్డులోనూ రోజూ శానిటేషన్ కార్యక్రమం సక్రమంగా జరగడం లేదని, పది రోజులకోసారి చెత్త తొలగిస్తున్నారని విమర్శించారు. దీనిపై కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎల్‌బిచర్లలో అన్నదానం

ప్రజాశక్తి - నరసాపురం

ఎల్‌బిచర్లలో పార్వతి సోమేశ్వరస్వామి ఆలయ పున:ప్రతిష్ట సందర్భంగా చివరి రోజు బుధవారం అన్నసమరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యాత్రికులు పాల్గొన్నారు

మొగల్తూరు : మొగల్తూరులోని ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం అన్న సమారాధన చేశారు. ఏటా అంతర్వేది వెళ్లిన పౌర్ణమి రోజున అమ్మవారి జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జాతర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధన అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.